# బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా కుక్కల విజయ్ కుమార్ నియామకం

## శాలువాతో సత్కరించిన పార్టీ నాయకులు.



పరకాల జూన్ 16:(వుదయం ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ పరకాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా కుక్కల విజయ్ కుమార్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా నాయకత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయనను పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సమావేశానికి బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పగడాల కాళీ ప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న కుక్కల విజయ్ కుమార్‌ను పరకాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా నియమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పట్ల కుక్కల విజయ్ కుమార్‌కు ఉన్న అవగాహన, సేవాభావం మరియు చిత్తశుద్ధి పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఆయన సమర్థవంతంగా కృషి చేస్తారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పరకాల పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు స్థానిక సమస్యల పరిష్కారంలో బీజేపీ మరింత చురుకైన పాత్ర పోషించేందుకు ఈ నియామకం దోహదపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# తెల్లవారితే పుట్టినరోజు అంతలోనే రోడ్డు ప్రమాదం



జన్నారం, జూన్ 16(వుదయం విలేకరి) పుట్టినరోజు వేడుకలకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన రాకేష్(22) మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదం నింపింది. చింతగూడ గ్రామానికి చెందిన గుండ మల్లేష్, సుజాత దంపతుల పెద్ద కుమారుడు రాకేష్ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నాడు. మంగళవారం రాకేష్ పుట్టినరోజు కావడంతో స్నేహితులు సోమవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత కేక్ కట్ చేయాలని చెప్పారు. దీంతో బైక్‌పై స్నేహితుల వద్దకు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారితే పుట్టినరోజు అనే సంబరం కాస్తా విషాదంగా మారడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. మల్లేష్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో రాకేష్ పెద్దవాడు. దీంతో గ్రామంలో విశాదచాయలు అలుముకున్నాయి.

# యూరియా కోసం రైతుల నిరీక్షణ.. యాప్ సమస్యలతో నానా ఇబ్బందులు

- సర్వర్ డౌన్‌తో బుకింగ్‌లకు బ్రేక్
- సహకార సంఘాల ద్వారా నేరుగా పంపిణీ చేయాలని రైతుల డిమాండ్



నాగిరెడ్డిపేట్, వుదయం:మండలంలోని కిచ్చన్నపేట్ సహకార సంఘం (తాండూర్ సొసైటీ) పరిధిలో యూరియా ఎరువు కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా పంపిణీ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ యాప్ సాంకేతిక సమస్యలతో రైతులకు తలనొప్పిగా మారింది. బుకింగ్ చేసేందుకు ప్రయత్నించిన ప్రతిసారి సర్వర్ డౌన్ అవుతుండటంతో రైతులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. యాప్‌లో ఎప్పుడు బుకింగ్ ప్రారంభమవుతుందో ముందస్తు సమాచారం లేకపోవడంతో రైతులు నిరంతరం మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్నారు. కొన్నిసార్లు యాప్ తెరుచుకున్నప్పటికీ వివరాలు నమోదు చేసేలోపే స్టాక్ పూర్తయినట్లు సందేశం వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు సాంకేతిక పరిజ్ఞానం లేక ఇబ్బందులు పడుతుండగా, పలుమార్లు నమోదు చేసిన వివరాలు మాయమవడంతో మళ్లీ మొదటి నుంచి నమోదు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం వానాకాల సాగు పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో యూరియా అత్యవసరమని, సమయానికి ఎరువు అందకపోతే పంటల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో బుకింగ్ పూర్తయిన వారికి మాత్రమే ఎరువులు అందుతుండటంతో సాంకేతిక సమస్యల కారణంగా అనేక మంది రైతులు యూరియాకు దూరమవుతున్న పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి యాప్‌లోని లోపాలను సరిదిద్దడంతో పాటు, సహకార సంఘాల ద్వారా నేరుగా యూరియా పంపిణీ చేసే విధానాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే తాండూర్ సొసైటీ పరిధిలో యూరియా నిల్వలను పెంచి రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని రైతులకు భరోసా కల్పించాలని రైతులు కోరుతున్నారు.

# జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్ సిగ్నల్

## భూసేకరణ ప్రక్రియ వేగవంతం ఎమ్మెల్యే పాయల శంకర్



ఆదిలాబాద్, జూన్ 16:బెంగళూరు నుంచి వచ్చిన ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారుల పర్యటనతో ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత జాయింట్ యూజర్ (డిఫెన్స్--సివిల్) ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టుకు మరో కీలక ముందడుగు పడిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, ఎయిర్‌ఫోర్స్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణపై స్పష్టత వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. రక్షణ శాఖ అవసరాల కోసం 1,500 ఎకరాలు, ఇప్పటికే డిఫెన్స్ పరిధిలో ఉన్న 360 ఎకరాలు, రన్‌వే విస్తరణ, టెర్మినల్ నిర్మాణం కోసం మరో 80 ఎకరాలతో కలిపి మొత్తం 1,840 ఎకరాల భూమి అవసరమని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 700 ఎకరాల భూసేకరణ జీవో ప్రకారం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన భూముల సేకరణకు అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రక్షణ శాఖకు 1,500 ఎకరాల భూమి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి ప్రాజెక్టు ఇప్పుడు తుది రూపు దాల్చుతోందని, ఇది ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి శుభసూచకమని ఎమ్మెల్యే అన్నారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగి జిల్లా ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ భారీ ప్రాజెక్టు అమలులో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక చొరవ చూపుతున్నారని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రశంసించారు.



# అభివృద్ధికి ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్

## రూ.1 కోటి 97లక్షల 77 వేల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం..

వర్ధన్నపేట జూన్ 16 (వుదయం ప్రతినిధి): పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రూ.1 కోటి 97లక్షల 77 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే నాగరాజు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ఈ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ఈనిధులనువినియోగించనున్నట్లు వెల్లడించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, అభివృద్ధి పనులు పూర్తయితే ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి వైస్ చైర్మన్ నేతావత్ షిభారాణి, కమిషనర్ జొనా, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు కామెడీ కీమా దేవేందర్ రాణి కుమారస్వామి సునీత వీరన్న రామ అరుణ తిరుపతి సురేష్ సిల్వర్ కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జన్నారం, కవ్వాల, కలమడుగు సబ్ స్టేషన్ల పరిధిలో 3 గంటల పాటు విద్యుత్ నిలిపివేత



జన్నారం, జూన్ 16(వుదయం విలేకరి) 33కేవి,11కేవి, ఇతర లైన్ల ఇరుపక్కల ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. అందువల్ల జన్నారం మండల కేంద్రం సబ్ స్టేషన్, కవ్వాల, కలమడుగు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏడీఈ ప్రభాకర్ రావు తెలిపారు. ఈ సమయంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు



భూపాలపల్లి జూన్ 16(వుదయం విలేకరి)
భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలంలోని ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సీసీఎస్ సీఐ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల గణపురం మండలంలోని ఫర్టిలైజర్ షాపులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. తనిఖీల సందర్భంగా షాపులలోని స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. గడువు ముగిసిన విత్తన ప్యాకెట్లు, నకిలీ విత్తనాలు, విడి విత్తనాల విక్రయాలు చేయరాదని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని షాపు యజమానులకు సూచించినట్లు వెల్లడించారు వ్యవసాయదారులను మోసగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా విత్తనాల విక్రయాలు నిర్వహించినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వ్యవసాయదారులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానాస్పద విత్తనాల విక్రయాలపై సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

*అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు మంచి పౌష్టికాహారం లభిస్తుంది... సర్పంచ్ సరికెల్ల లతిక నరేష్*



కోరుట్ల జూన్ 16 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో మంగళవారం గ్రామ సర్పంచ్ సరికెల్ల లతీక నరేష్ అంగన్వాడి సూపర్వైజర్ చే అక్షరాభ్యాసం చేయించారు అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలను అంగన్వాడి సెంటర్లో చేర్పించాలని మంచి పౌష్టికాహారం అందుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరికెల్ల లతికా నరేష్ అంగన్వాడి సూపర్వైజర్ టీచర్స్ తల్లిదండ్రులు పిల్లలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు

# తొర్రూరు సొసైటీ ని సందర్శించిన కర్నూలు బృందం



తొర్రూరు జూన్ 16 (వుదయం ప్రతినిధి):తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కర్నూల్ జిల్లా బృందం తొర్రూరు పిఏసిఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్ రావు అధ్యక్షతన సొసైటీ అభివృద్ధి పైన ప్రజెంటేషన్ మంగళవారం నాడు ఇవ్వడం జరిగినది. కర్నూలు జిల్లాడిసిసి బ్యాంక్ సీఈవో రామాంజనేయులు, డీజీఎం ఉమామహేశ్వర్ రెడ్డి, డిపిఎం రంగనాథ్, మామిండ్లపాడు పిఏసిఎస్ చైర్మన్ సూర్య ప్రకాష్ రెడ్డి, పసుపల్ల పిఏసిహెచ్ చైర్మన్ వెంకట్రాములు, వెల్దుర్తి పిఏసిఎస్ చైర్మన్ రమాకాంత్ రెడ్డి,నందికొట్కూర్ పిఏసిఎస్ చైర్మన్ ముత్రాజ్ వలి,సీఎం ఆపరేషన్ సెక్షన్ అధికారి రాఘవేంద్ర, సీఎం పి డి సి సెక్షన్ ప్రతినిధి ఇందిరా ప్రియదర్శిని,ఎల్టి సెక్షన్ అధికారి పద్మావతి, ఏఎంపీడీసీ సెక్షన్ అధికారి ఎండి ముష్రత్,ఏఎం ఓఆర్ సెక్షన్ అధికారి కరిష్మా, ఏసిఎపిడిసి సెక్షన్ అధికారి మమత, సీఎం కోయిల కుంట్లబ్రాంచ్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి,విష్ణు నగర్ బ్రాంచ్ మేనేజర్ ఎం. రమాదేవి, కోడుమూరు బ్రాంచ్ మేనేజర్ అయ్య స్వామి,ముత్యాల పిఏసిహెచ్ సీఈవో హరినాథ్ రెడ్డి, చాగలమర్రి పిఏసిఎస్ సీఈవో ఉపేంద్ర కుమార్ రెడ్డి, భానుమకుల పిఏసిఎస్ సీఈవో ఎండి షమీర్, ఆత్మకూర్ పిఏసిఎస్ సిఓ ప్రసన్నకుమార్ల బృందం మంగళవారం నాడు స్టడీ టూర్ లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో స్వల్ప కాలంలోనే గొప్ప అభివృద్ధిని సాధించిన సొసైటీగా గుర్తింపు పొందిన తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి సంఘం అభివృద్ధికి గల కారణాలను ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. సొసైటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన పాలకవర్గాన్ని అభినందిస్తూ చైర్మన్ కాకినాడ హరిప్రసాదరావు గారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాస్,సంతోష్ యాకయ్య,నవీన్ ఉపేందర్,సిబ్బంది పాల్గొన్నారు.

# జి-రామ్‌జీ పథకానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తీర్మానం చేయాలి

- నిరుపేద కూలీలకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్



మంథని, జూన్ 16 (వుదయం ప్రతినిధి):మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న జి-రామ్‌జీ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మంథని మండలం పుట్టపాక గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన అనంతరం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం అమలులో ఉన్న ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు జీవనాధారంగా మారిందన్నారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకం స్థానంలో జి-రామ్‌జీ పథకాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వచ్చే జూలై నెల నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని, అది అమలులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా లభిస్తున్న హక్కులను కాపాడుకోవాలంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో జి-రామ్‌జీ పథకాన్ని అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏల్పుల సురేష్‌తో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# అమ్మ మాట అంగన్వాడి బాట ర్యాలీ





భూపాలపల్లి జూన్ 16(వుదయం విలేకరి) కాటారం మండలంలోని శంకరంపల్లి గ్రామ పంచాయతి పరిధిలోని గొల్లపల్లి అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం సూపర్వైజర్ వీణ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్ వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాదేవపూర్ సీడీపీవో రాధికా రెడ్డి పాల్గొని. 3-6 సం॥ లోపు పిల్లలందరిని అంగన్వాడి పాఠశాలల్లో చేర్పించాలని ప్రైవేట్ పాఠశాలల కంటే అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు మంచి ఆటపాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని అన్నారు 0 - 6 సం. లోపు పిల్లలలో మెదుడు 80% నుండి 90% వరకు అభివృద్ధి చెందుతుంది అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు అందించే విద్యతో పాటు ఆటపాటల ద్వారా పిల్లల మెదడు అభివృద్ధి చెంది శారీరక మానసికంగా అభివృద్ధి చెందుతూ దృఢంగా తయారవుతారని తెలిపారు అంగన్వాడి లో అందించే పౌష్టిక ఆహారాలను పిల్లలతో పాటు బాలింతలు గర్భిణీలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు అంతకుముందు అంగన్వాడి కేంద్రంలో కొత్తగా వచ్చిన పిల్లలకు సిడిపివో స్వాగతం పలికారు. అక్షరాభ్యాసం నిర్వహించి చిన్నారులన ఆశీర్వదించారు. అనంతరం అమ్మమాట బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కారోబార్ మల్లేష్. అంగన్వాడీ టీచర్లు సువర్ణ, మంజుల, గర్భిణీలు బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు

## మొదటి రోజు టెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ : జిల్లా కలెక్టర్



హైదరాబాద్ :జిల్లాలో మంగళవారం నిర్వహించిన టీజీ టెట్ జూన్--2026 మొదటి రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన సమగ్ర ఏర్పాట్లతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు సజావుగా సాగాయని పేర్కొన్నారు. జిల్లాలోని అను బోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొదటి సెషన్ లో 145 మంది అభ్యర్థులు కేటాయించగా, 127 మంది హాజరై పరీక్ష రాశారు. 18 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్ణీత సమయానికి ప్రారంభమై ప్రశాంతంగా ముగిసింది. రెండవ సెషన్ లో కూడా 145 మంది అభ్యర్థులు కేటాయించగా, 123 మంది హాజరయ్యారు. 22 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఈ సెషన్ కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించబడింది. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రంలో భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణలో టెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

# దమ్మపేట మండలంలో రూ.1.20 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

### ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే పల్లె పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుంది






దమ్మపేట జూన్ 16 (వుదయం ప్రతినిధి ):అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలో రూ. 1,20,80,000 విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, రవాణా, చిన్నారుల సంక్షేమ మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన ఈ కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి దోహదపడనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ సందర్భంగా అంకంపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని కొడిసెలగూడెంలో టిడబ్ల్యూయూ పీఎస్ పాఠశాలకు నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు అనంతరం పట్వారిగూడెం గ్రామంలో రూ. 36 లక్షల వ్యయంతో నిర్మించిన ఎనిమిది సీసీ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు బాలరాజుగూడెం గ్రామపంచాయతీ దిబ్బగూడెం గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించిన ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించిన ఎమ్మెల్యే గారు మెండివారి గ్రామంలో రూ. 11.80 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు నాగుపల్లి గ్రామంలో రూ. 15 లక్షలతో నిర్మించిన ఆధునిక అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి చిన్నారుల విద్య పోషకాహారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు

తొట్టిపంపు గ్రామంలో ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ. 10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను లింగాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గౌరారెగుట్ట గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు రూ. 20 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడలను ప్రారంభించారు అలాగే మారప్పగూడెం గ్రామపంచాయతీ కొత్తూరులో రూ. 8 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని పాత చీపురుగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో రూ. 10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే పల్లె పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు కూడా నాణ్యమైన విద్యను అందుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన భద్రతా ప్రమాణాల మెరుగుదల విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు గ్రామీణ ప్రాంత పిల్లలు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడే స్థాయికి ఎదగడం మనందరి బాధ్యతని అన్నారు

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో రోడ్లు విద్యాసంస్థలు అంగన్‌వాడీ కేంద్రాలు తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

# మత్స్య కారులకు అవగాహన సదస్సు



మహబూబాబాద్, జూన్.16వుదయం జిల్లా ప్రతినిధి

మహబూబాబాద్ జిల్లాలోని వివిధ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలల పరిధిలోని చెరువులు మరియు కుంటలలో సంఘ పరిధిలోని పరిసర గ్రామాల ప్రజలు మరియు ఇతర కులస్థులు అక్రమముగా చేపలు పట్టు విషయము గూర్చి జిల్లాలోని వివిధ సంఘాల మరియు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘ నాయకులు శ్రీయుత జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది.

ఈ విషయంలో శ్రీయుత జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ గారి ఆదేశానుసారంగా జిల్లా మత్స్యశాఖ అధికారి కార్యాలయం మహబూబాబాద్ నందు ఫిర్యాదుదారులను పిలిచి సమావేశము ఏర్పాటు చేయనైనది. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరము జిల్లాలోని అన్ని పారిశ్రామిక సహకార సంఘాలు తమ తమ చెరువుల యొక్క కౌలు రకములను సకాలంలో చెల్లించి ఈ కార్యాలయము ద్వారా ఫిషింగ్ రైట్ అనగా చేపలు పట్టుటకు అనుమతి పత్రము పొందినట్లయితే మీ చెరువులలో అక్రమంగా ఇతర కులస్తులు లేదా పరిసర గ్రామ ప్రజలు చెరువులను నూటి చేయకుండా మరియు మీ చెవులలోని మత్స్య సంపదను దొంగతనంగా పట్టకుండా అడ్డుకోవచ్చును మరియు మీ యొక్క సంఘ పుస్తకములను ప్రభుత్వ నియమాల ప్రకారంగా తప్పక వ్రాసుకోవాల్సిందని మరియు మీ సంఘ పరిధిలోని చెరువులను మధ్యతరాల్లో గాని లేదా ఇతరులకు గాని లీజుకు ఇచ్చినట్లు ఈ కార్యాలయమునకు తెలిసినట్లయితే మీ యొక్క చెరువుల కౌలును రద్దుచేసి మీ సంఘం యొక్క రద్దుకు పై అధికారులకు సిఫారసు చేయబడుతుందని తెలియజేశారు.

ఈ సమావేశంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ మాట్లాడుతూ జిల్లాలోని మత్స్యకారులు వారి పరిధిలో ఉన్న చెరువులను మధ్య దళారులకు లీజుకు ఇవ్వకూడదని మరియు మీ పరిధిలో ఉన్న చెరువులపై సంఘ సభ్యుల ద్వారా విధిగా కాపలా చేయించవలసిందిగా తద్వారా మీ చెరువులను చెరువులోని మత్స్య సంపదను సంఘ సభ్యులు కాపాడుకోవాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి జరుపుల భాస్కర్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, మహబూబాబాద్, చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ జిల్లా ప్రమోటర్స్ లింగాల పిచ్చయ్య సింగాని అశోక్ ,జిల్లా మత్స్య శాఖ ఇన్స్పెక్టర్ దామెర శ్రీనివాస్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు బసవైన వెంకన్న, పిడుగు నరసయ్య, కొనతం సత్యం,పిడుగు వెంకన్న, గొడుగు వెంకన్న, శ్రీనివాస్, కోల రవి భూముల గురుమూర్తి జిల్లా మత్స్య శాఖ సిబ్బంది విష్ణు, శ్రీపతి రాజు, శివశంకర్, వేణు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలి



మహాదేవపూర్ జూన్ 16(వుదయం ప్రతినిధి) పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి అన్నారు మంగళవారం మహాదేవపూర్ ప్రాజెక్టు పరిధిలోని బెగులూరు గ్రామపంచాయతీలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు దానిలో భాగంగా అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని ఉద్దేశించి ర్యాలీ నిర్వహించారు అనంతరం మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సిడిపిఓ రాధికా రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు రెండున్నర సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల వరకు పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు అంగన్వాడి సెంటర్లో పిల్లలకు ఆట పాట కథ సృజనాత్మకతల ద్వారా పిల్లల మీద వికాసం భాష శారీరక అభివృద్ధి జరుగుతుందని తెలిపారు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందే సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు గర్భిణీలు బాలింతలు అంగన్వాడి సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దామోదర్ రెడ్డి అంగన్వాడి టీచర్లు సరస్వతి సుజాత నాగలక్ష్మి హెల్పర్లు రాజేశ్వరి సరిత సమ్మక్క తల్లులు గర్భిణీలు బాలింతలు పిల్లలు పాల్గొన్నారు

# పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి

### కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 16 (వుదయం ప్రతినిధి)జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం ఆళ్ళపల్లి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఆళ్ళపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ విభాగం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులకు అందిస్తున్న బోధన విధానం, విద్యా కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించేందుకు సిద్ధంగా ఉంచిన భోజనం, పాలు, బాలామృతం తదితర పోషకాహార పదార్థాలను పరిశీలించారు. కేంద్రంలో కేవలం ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండటాన్ని గమనించిన కలెక్టర్, హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్ద వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గొత్తికోయలు నివసించే ఈ మారుమూల గిరిజన ప్రాంతంలో బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, పిల్లల సంఖ్య, వారికి అందిస్తున్న సేవలు, పోషకాహార సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో తక్కువ మంది పిల్లలు ఉన్నప్పటికీ అధిక మొత్తంలో నిల్వలు ఉండటాన్ని గమనించి, అవసరానికి మించి ఉన్న సరుకులను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అలాగే కేంద్రాల్లో పిల్లల చేరికలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశీలన సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, అంగన్‌వాడీ కేంద్ర భవనానికి పెయింటింగ్ వేయించి పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా, పోషకాహార సేవలు అందేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి నుండి పెద్ద వెంకటాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు కుంగిపోయి ఉండటాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గమనించారు. వెంటనే వాహనం దిగి కల్వర్టును పరిశీలించిన కలెక్టర్, వర్షాకాలంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆళ్లపల్లి తాసిల్దారు ఉషారాణి, ఎంఈఓ శాంతారావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన అంబాల.చంద్రమౌళి మాదిగ.

భూపాలపల్లి జూన్ 16 వుదయం ప్రతినిధి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం లోని పలు గ్రామాలలో మృతి చెందినటువంటి మృతుల కుటుంబాలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ మరియు టేకుమట్ల మండల ఇన్చార్జి మంద తిరుపతి మాదిగ పలు మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంకుషాపూర్ గ్రామంలోని కీ శే గౌనెపెల్లి సంపత్ అంతిమ యాత్రలో పాలుగొని పాడె మోయడం జరిగింది నవంబపేట గ్రామానికి చెందిన నేరెళ్ల లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది రామకృష్టపూర్ వి గ్రామానికి చెందిన కీ శే లద్దునూరి . కిరణ్ మృత దేహానికి నివాళులు అర్పించడం అంతిమ యాత్రలో పాలుగొనడం జరిగింది మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు నేర్పటి అశోక్ తండి కీ శే నేర్పటి సారయ్య కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రామ్ రాంచందర్ రేణుకుంట్ల సంపత్ నేరెళ్ల ఓదెలు తదితరులు పాలుగోన్నారు.

# మానవత్వానికి అత్యున్నత సేవ రక్తదానం: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

### హనుమకొండ రెడ్ క్రాస్ భవన్‌లో ఘనంగా 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం'

### రక్తదాతలు, క్యాంప్ నిర్వాహకులకు ప్రశంసా పత్రాల పంపిణీ



హనుమకొండ, జూన్ 16 (వుదయం జిల్లా ప్రతినిధి) : ఒక్కసారి చేసే రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానం మానవత్వానికి అత్యున్నత సేవ అని హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా రక్తగ్రూపుల ఆవిష్కర్త కార్ల్ ల్యాండ్‌స్టీనర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు, కలెక్టర్ రెడ్ క్రాస్ భవనంలోని తలసేమియా సెంటర్‌ను సందర్శించి, చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. తలసేమియా రోగులకు నిరంతర రక్త సరఫరా, వైద్య సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని అభినందించారు. ?జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ హనుమకొండ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, తలసేమియా కేంద్రం రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణం. వరదలు, విపత్తుల వేళ రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం. ?కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులోనూ రక్తదాన శిబిరాల నిర్వహణకు పూర్తి సహకారం అందిస్తాం. నా వ్యక్తిగత తరఫున కూడా రెడ్ క్రాస్‌కు నిరంతర సాయం ఉంటుంది. ?క్రెడాయ్ జిల్లా అధ్యక్షులు నాయిని అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ సంస్థ తరఫున రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలకు రూ. 2 లక్షల విరాళం ప్రకటిస్తున్నాం. ?రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ వి. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ కార్ల్ ల్యాండ్‌స్టీనర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవం జరుపుకుంటున్నాం. జిల్లాలో విస్తృతంగా క్యాంపులు పెట్టి అవసరమైన వారికి రక్తాన్ని అందిస్తున్నాం. ?రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు: కలెక్టర్ సూచనల మేరకు జిల్లా అధికారులు, విద్యాసంస్థల సహకారంతో వారానికి కనీసం ఒక రక్తదాన శిబిరం నిర్వహించేలా కార??యాచరణ రూపొందించాం. ?అనంతరం, సమాజంలో స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ శిబిరాలు నిర్వహించిన నిర్వాహకులను, అత్యుత్తమ రక్తదాతలను కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ పాలకవర్గం శాలువాలు, షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. ?ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిల్లా రమణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రాంకుమార్, దాతలు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి సెంటర్లలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం

చిట్యాల జూన్ 16(వుదయం ప్రతినిధి)

అంగన్వాడి సెంటర్ లో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు అంగన్వాడి సూపర్వైజర్ సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు అమ్మ మాట అంగన్వాడి బాట ర్యాలీ చిట్యాల మండలం ఒడితల, లక్ష్మీపూర్ తండా గ్రామంలో అమ్మ మాట అంగన్వాడి బాట ప్రోగ్రాం నిర్వహించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి సెంటర్లకి కొత్త పిల్లలను నమోదు చేసి సామూహిక అక్షరాభ్యాసం చేయడం జరిగిందని వెల్లడించారు. మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్వాడి సెంటర్ కి పంపించాలని ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు అంగన్వాడీలో అందించే పోషకాహారం పిల్లల మానసిక శారీరక ఎదుగుదలకు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటపాటలతో విద్యానందించే అంగన్వాడి బడి అని తెలిపారు అంగన్వాడికే పిల్లలందరినీ పంపించాలని తల్లులకు గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ అంగన్వాడీ టీచర్స్ అంగన్వాడి హెల్పర్స్ ఆశ గ్రామంలోని బాలింతలు గర్భిణీలు కిశోర బాలికలు పిల్లల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొనడం జరిగిందని అన్నారు.

# విద్య అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు

## సర్పంచ్ పూజారి రాజేందర్





జయశంకర్ భూపాలపల్లి జూన్ 16(వుదయం జిల్లా ప్రతినిధి)విద్యా అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని సర్పంచ్ పూజారి రాజేందర్ అన్నారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలం ధర్మరావుపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి సూచనల మేరకు బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్యక్రమం తో పాటు అక్షరాభ్యాసం కార్యక్రమం సూపర్వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పూజారి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ప్రతి బిడ్డకు ప్రాథమిక హక్కు అని బాలురు బాలికలు అనే తేడా లేకుండా ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు.

బాలికల విద్య కుటుంబాభివృద్ధికి, సమాజ పురోగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇంచార్జి మిషన్ కోఆర్డినేటర్ క్రిష్ణ మాట్లాడుతూ మహిళల సాధికారత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్యాభివృద్ధి మహిళల భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. అలాగే మహిళలు మరియు బాలికల కోసం అందుబాటులో ఉన్న 181 మహిళా హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు మరియు 14567 సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని తెలిపారు. జెండర్ స్పెషలిస్ట్ అనూష కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా బేటీ బచావో బేటీ పడావో వంటి పథకం బాలికల విద్య, భద్రత ఆర్థిక భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. కుటుంబాల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని పేర్కొన్నారు

సూపర్వైజర్ లక్ష్మి అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం ద్వారా మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతులకు ఉరితాడుగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

### యాప్ పేరుతో అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గం

### యాప్‌ను రద్దు చేసే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తాం

### వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్



పర్వతగిరి, జూన్ 16 ( వుదయం ప్రతినిధి ) : రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తూ, వ్యవసాయాన్ని కుంటుపరిచేలా ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా మొబైల్ యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్ర డిమాండ్ చేస్తూ ప్రభుత్వం పై ఆగ్రహం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మంగళవారం పర్వతగిరి మండల పత్రిక ప్రకటనలో వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆరూరి రమేష్ మాట్లాడుతూ, సాంకేతికత పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ రైతులకు ఉపయోగపడటం కన్నా ఇబ్బందులు సృష్టిస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, స్మార్ట్‌ఫోన్‌లు లేని రైతుల పరిస్థితిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. యాప్ ద్వారా యూరియా పంపిణీ చేయడం వల్ల రైతులు ఎరువుల కోసం రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని సులభతరం చేయాల్సిన ప్రభుత్వం తుగ్లక్ నిర్ణయాలతో రైతులపై అదనపు భారాన్ని మోపుతోందని విమర్శించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందక పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యూరియా యాప్ కారణంగా బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందని, రైతులు ప్రైవేట్ వ్యాపారుల చేతిలో దోపిడీకి [illegible] ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగానికి ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకున్నారని, కానీ నేడు రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మునుపటిలాగే గుర్తింపు కార్డుల ఆధారంగా నేరుగా ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గం తో పాటు జిల్లా వ్యాప్తంగా సరిపడా యూరియా, ఇతర ఎరువుల నిల్వలను ప్రభుత్వం వెంటనే అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులకు శాపంగా మారిన యూరియా యాప్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో రైతాంగంతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నక్ష కార్యక్రమం అమలును పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద.



వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూన్ 16. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలో అమలవుతున్న నక్ష కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మునిసిపల్ పరిధిలోని 6వ వార్డులో నివాస గృహాలు, వ్యవసాయ భూముల్లో జరుగుతున్న నక్ష సర్వే పనులను ఆమె స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నక్ష కార్యక్రమం ద్వారా భూ వివరాల నమోదు సక్రమంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. భూ రికార్డుల ఆధునీకరణ, భూ యాజమాన్య వివరాల స్పష్టత కోసం ప్రభుత్వం చేపడుతున్న నక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్ రావు, వరంగల్ ఆర్డీవో సుమతో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూపాలపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పవన్‌కుమార్‌కు సన్మానం



జయశంకర్ భూపాలపల్లి జూన్ 16 (వుదయం జిల్లా ప్రతినిధి)భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కే. పవన్‌కుమార్‌ను జిల్లా పద్మశాలి సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బీమనాదుని సత్యనారాయణ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన పోలీసు శాఖ బదిలీల్లో భాగంగా మహదేవపూర్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన పవన్‌కుమార్ భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అలాగే యువత మత్తు పదార్థాలు, గంజాయి వంటి వ్యసనాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అవసరమైన చోట కౌన్సెలింగ్ అందించి సమాజానికి ఆదర్శప్రాయమైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బాగవతం భిక్షపతి, తౌటం ప్రభాకర్, గోనె భాస్కర్, కోశాధికారి వీరస్వామి, పట్టణ కార్యదర్శి షేర్‌కుమార్, కాటారం మండల అధ్యక్షుడు గాదె రమేష్, పినుమళ్ల రమేష్, సంతోష్‌తో పాటు పలువురు పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

## -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిర్యాల/రామకృష్ణాపూర్ జూన్ 16(వుదయం ప్రతినిధి) గ్రామస్థాయి నుండి అభివృద్ధి దిశగా నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ శిక్షణలో 16వ ఆర్థిక సంఘం నిబంధనలు, పెసా గ్రామపంచాయతీలు, సభాసర్ ,నిర్ణయ్ యాప్, ఈ - గ్రామ స్వరాజ్ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అత్యుత్తమ ర్యాంకింగ్ వచ్చేలా గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని, పంచాయతీ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరు కావాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, గ్రామసభలు నిర్వహించి గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, పన్నులు సకాలంలో వసూలు చేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యాలయ భవనం ఉండాలని, ఇందుకు గాను భవనాలు లేని పంచాయితీలలో అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. గ్రామాల పరిధిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టే విధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని, ఈ నేపథ్యంలో నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సి.జి.జి. కన్సల్టెంట్ మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజెన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలి

## టాస్క రాష్ట్ర అధ్యక్షులు పి నర్సింహారావు






జగిత్యాల జూన్ 16 (వుదయం ప్రతినిధి) సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారం సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి నర్సింహా రావు డిమాండ్ చేశారని ఆ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ తెలిపారు మంగళవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం హైదరాబాద్ లో మెట్టు గూడ విజయపురి కాలనీలో మర్రి కృష్ణారెడ్డి హాల్ లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ వయోధికుల వేధింపుల నివారణ అవగాహన రోజు సందర్భంగా జరిగిన సదస్సు విశేషాలను జిల్లా లోని సీనియర్ సిటిజన్స్ సంఘాల ప్రతినిధులకు వివరించారు ఈ సదస్సులో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కోదండరాం రిటైర్డ్ జస్టిస్ చంద్ర కుమార్ మాజీ ఎమ్మెల్సీ పి సుధాకర్ రెడ్డి ప్రొఫెసర్ మానస చెన్నప్ప టాస్కా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ చౌదరి వివిధ జిల్లాల అధ్యక్షులు జగిత్యాల జిల్లా నుంచి జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి హన్మంత్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు ఈ సదస్సులో టాస్క రాష్ట్ర అధ్యక్షులు పి నర్సింహా రావు మాట్లాడుతూ వయోధికుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పోలీస్ శాఖ చట్టం మేరకు వేధింపులపై సత్వర చర్యలు తీసుకుంటేనే చాలా వరకు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ వయోధికుల సంరక్షణ చట్టం పటిష్టంగా అమలుకు ప్రత్యేకంగా శాఖ ఏర్పాటు కు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం తదితర ముఖ్య అతిథులతో పాటు జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ కోరుట్ల డివిజన్ అధ్యక్షులు పబ్బా శివానందం లను మెమంటో లతో పట్టు శాలువా లతో యాదగిరి నర్సింహా స్వామి ప్రసాదాన్ని అందజేసి సన్మానించారు పలువురు టాస్క ట్రస్ట్ కోసం స్వచ్ఛందంగా విరాళాలు ప్రకటించారు వయోధికుల సేవల కోసం టాస్క రాష్ట్ర శాఖకు విరాళాలు అందజేయాలని కోరారు

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన పాస్టర్ కు సన్మానం



మంథని, జూన్ 16: వుదయం ప్రతినిధిఇటీవల గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన పాస్టర్ కన్నూరి కృపావరం ను మంథని మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం మంథని మండలంలోని గుంజపడగ గ్రామంలో గ్లోరియస్ ప్రార్థన మందిరంలో నిర్వహించిన మంథని మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సహవాస కూడికజరిగింది. ఇటీవల 2000 మంది సంగీత కళాకారులు ఒకే చోట వాయిద్యాలు వాయించి గిన్నిస్ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కృపావరము ను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంథని డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాంపల్లి దాస్, మంథని మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కలవల సామ్యూల్, ప్రధాన కార్యదర్శి సిరిపురం అబ్రహం, పాస్టర్లు మంథని మార్క్, ఎలీషా తో పాటు తదితరులు పాల్గొన్నారు

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభం...




జగిత్యాల జూన్ 16 (వుదయం ప్రతినిధి) రాయికల్ మండలం ధర్మాజి పెట్ గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ మర్యాద లేకుండా ఎంపీ మధ్యలో వెళ్ళడం విడ్డూరంగా ఉందని ఎంపీ రాక కోసం 2 గంటల పైగా గ్రామస్తులతో కలిసి వేచి చూశామని బీజేపీ నాయకులు రెచ్చగొట్టే లా స్లోగన్ లు చేశారు రాజకీయాల్లో లేకముందే మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన మండలంలో ఒక్కో గ్రామానికి 100 సార్లు వచ్చాను అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వం జి ఎస్ టి రూపంలో కేంద్రానికి పన్నులు కడితే 100 శాతం లో 41శాతం నిధులు మాత్రమే రాష్ట్రాలకు ఇస్తున్నారు ఫెడరల్ స్ఫూర్తి అనుగుణంగా రాష్ట్రాలకు కేంద్రం నిధులు మంజూరు చేయాలి వడ్లు మక్కలు కొనుగోలు లో కేంద్రం విఫలమైంది వేచి చూసిన నాయకులు ప్రజా ప్రతినిధులు గ్రామస్తుల వినతులకు ఎంపీ కనీస పట్టింపు లేదు ఎమ్మెల్యే పదవి శాశ్వతం కాదు ప్రజా సేవే ముఖ్యం అని అవసరం అయితే కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటానని తెలిపారు ఎంపీ అహంకారం తో మాట్లాడుతున్నారని రాయికల్ కు నిధులు బోర్న్ పల్లి జగన్నాద్ పూర్ బ్రిడ్జి నిధులు అడుగుతారని ప్రజల వినతులు ప్రశ్నలకు భయపడి మధ్యలో వెళ్లినట్టు ఉన్నారు అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం గ్రామానికి 52 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసమే యాప్ పెట్టడం జరిగిందని కేంద్రం నుండి రావాల్సిన యూరియా కోత విధించడం వల్లనే రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసమే యాప్ పెట్టడం జరిగిందన్నారు భారత దేశ రూపాయి విలువ పతనం పేద మధ్య తరగతి ఆడబిడ్డలు కొనని విదంగా బంగారం ధరలు ఆకాశాన్ని అంటాయని పెట్రోల్ డీజిల్ ధరలు పెరుగుతున్నాయని జగిత్యాల నియోజకవర్గానికి 14 పల్లె దవాఖానలు మంజూరు చేయటం జరిగిందని మీరు ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేసిన కోరుట్ల కు ఎన్ని పల్లె దవాఖాన లు మంజూరు చేశారరో సమాధానం చెప్పాలన్నారు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పల్లె దవాఖాన లు మంజూరు కు కృషి చేశానని ప్రజల చెంతకే మెరుగైన వైద్యం పల్లె దవాఖాన పూర్తికి 2 లక్షలు నిధులు మంజూరు చేస్తానని ఎంపీ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఛైర్మన్ సంగనబట్ల దినేష్ ఆత్మ ఛైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి మండల నాయకులు కోల శ్రీనివాస్ రవీందర్ రావు మోర హనుమండ్లు సంధ్య రాణి సురేందర్ నాయక్ అచ్యుత రావు ఏనుగు మల్లారెడ్డి సర్పంచ్ గంగారెడ్డి ధర్మాజీపేట నాయకులు హరీష్ వెంకటేష్ రాజ శేఖర్ మాజీ సర్పంచ్ పల్లికొండ గంగరాజు స్నేహలత మహేష్ డియంహెచ్ఓ సుజాత ఎంపీడీవో చిరంజీవి తహసీల్దార్ నాగార్జున ఎంపీఓ సుష్మా డిఈ మిలింద్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (SIR) కార్యక్రమం – జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ జిల్లా 16జూన్ (వుదయం బ్యూరో )

జిల్లాలో చేపట్టనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు, వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బూత్ లెవల్ సూపర్వైజర్లు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు (ACLMTs), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (AEROs), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (EROs) లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు తప్పులు లేని స్పష్టమైన ఓటర్ల జాబితా అత్యంత కీలకమని అన్నారు. నకిలీ ఓటర్లు, మరణించిన వ్యక్తుల పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా సవరించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి పౌరుని ఓటు హక్కును పరిరక్షించేందుకు ఈ ప్రక్రియ అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుని ఓటర్ల ధృవీకరణ, మ్యాపింగ్ ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పు నమోదులు, అనవసర తొలగింపులు జరగకుండా జాగ్రత్త పడాలని అన్నారు. బూత్ లెవల్ అధికారులు (BLOలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడి వివరాలను ధృవీకరించిన తర్వాతే జాబితాలో మార్పులు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ERO లు, నియోజకవర్గ స్థాయిలో AEROలు, సమర్థవంతంగా పనిచేయాలని, EPIC డిప్యూటీ తహసీల్దార్లు కూడా అత్యంత బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. BLO సూపర్వైజర్లు, ACLMTలు శిక్షణలో అందించిన సూచనలు, మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని మండల స్థాయిలో BLOలకు నిర్వహించే శిక్షణలో SIR ప్రక్రియను సమగ్రంగా వివరించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు సాధారణ ప్రభుత్వ పనులు కాదని, అత్యంత ప్రాధాన్యమైన బాధ్యతగా పరిగణించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. SIR విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ విషయాన్ని ట్రైనర్లు BLOలకు కూడా స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. మండల స్థాయిలో AEROలు, నియోజకవర్గ స్థాయిలో EROలు తమ పరిధిలోని మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి ఐదు రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో పర్యటించి, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ SIR పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా EROలు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని తెలిపారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత సాంకేతిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా తిరస్కరణలు (Rejections) అత్యంత జాగ్రత్తగా పరిశీలించి చేపట్టాలని చెప్పారు. BLOలు, బూత్ లెవల్ ఏజెంట్లు (BLAలు) కలిసి ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత పత్రాల ఆధారంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ గుర్తింపు పత్రాలను సమర్పించి ధృవీకరణ ప్రక్రియలో సహకరించాలని కోరారు. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, ద్వంద్వ నమోదులు కలిగిన వారి పేర్లను తొలగించి, కొత్తగా అర్హత సాధించిన ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చనున్నట్లు వివరించారు.SIR కార్యక్రమ షెడ్యూల్‌ను వివరాలు:జూన్ 15 నుంచి 24 వరకు శిక్షణ, సన్నాహకాలు, ముద్రణ పనులు నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు BLOల ఇంటింటి సర్వే జరుగుతుందని చెప్పారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేస్తారని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని, జూలై 31 నుంచి ఆగస్టు 13 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. వాటి పరిష్కార ప్రక్రియ జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.శిక్షణ పొందిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు తమ మండలాలకు వెళ్లి జూన్ 17 నుంచి 24 వరకు నిర్వహించే మండల స్థాయి శిక్షణ కార్యక్రమాల్లో BLOలు, BLAలు, BLO సూపర్వైజర్లు, AEROలకు సమగ్ర అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. SIR ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రతి అంశాన్ని స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. SIR కార్యక్రమం కొనసాగుతున్నంత కాలం మండల తహసీల్దార్లు, AEROలు అందుబాటులో ఉండాలని, క్లిష్టమైన సమస్యలు లేదా సందేహాలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు. ఎస్ ఐ ఆర్ అవగాహనకు సంబంధించి జూన్ 17న జిల్లాస్థాయిలో 2K రన్, జూన్ 18న అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో 2K రన్ నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హారి ప్రియా, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ పోక్సో కేసు నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష – 1 లక్ష రూ. జరిమానా




మహబూబ్ నగర్ జిల్లా 16జూన్ (వుదయం బ్యూరో )

మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ క్రైం నెం. 592/2025 కేసు నమోదైన పోక్సో కేసు నిందితుడికి నేరం చేసినట్లు రుజువుకావడంతో ప్రత్యేక పోక్సో కోర్టు 20 సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ మహబూబ్‌నగర్ ప్రత్యేక సెషన్స్ జడ్జి, రేప్ & పోక్సో కేసుల విచారణ కోర్టు న్యాయమూర్తి తమన్ రాజ రాజేశ్వరి మంగళవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జి.విజయ్ కుమార్, ప్రత్యేక ప్రజా అభియోజకులు ఎం.జాన్, కోర్టు లైజన్ అధికారులుగా విధులు నిర్వహించిన బాలకృష్ణ (ఏఎస్ఐ), కృష్ణయ్య (పీసీ3666), శంకర్ (పీసీ2194), రహీమ్ (పీసీ2769) మరియు కేసు డాక్యుమెంటేషన్‌లో సహకరించిన అశోక్ రెడ్డి (పీసీ1441), సీడీఓ, మహబూబ్‌నగర్ రూరల్ పీఎస్ ల సేవలను జిల్లా పోలీసు శాఖ ప్రశంసించింది. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అధికారులందరినీ అభినందించారు. బాలలపై జరిగే లైంగిక నేరాల పట్ల జిల్లా పోలీసు శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, ఇలాంటి కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# విధులకు డుమ్మా.. కలెక్టర్ కంటపడ్డ ఉద్యోగులు



రాజోలి జూన్ 16 (వుదయం కరస్పాండెంట్)

జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, పారిశుద్ధ్య పరిస్థితులు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలు విభాగాలను సందర్శించి నిర్వహణ తీరుపై అధికారులను ప్రశ్నించారు.తనిఖీ సందర్భంగా రంజిత్‌కుమార్, కిష్టమ్మ అనే ఇద్దరు ఉద్యోగులు ఎలాంటి సెలవు దరఖాస్తు లేకుండానే చాలా రోజులుగా విధులకు గైర్హాజరవుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, ప్రభుత్వ సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. వెంటనే సంబంధిత ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రుల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, నిర్లక్ష్యాన్ని ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు

# మల్టీ స్కిల్ టెక్నీషియన్ శిక్షణ సర్టిఫికేట్ & జాబ్ ఆఫర్ లెటర్ ప్రదానోత్సవం



సంగారెడ్డి వుదయం

పిపల్ ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మల్టీ స్కిల్ టెక్నీషియన్ శిక్షణా కార్యక్రమం ఇటీవల విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణను పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు జాబ్ ఆఫర్ లెటర్లను కూడా ఘనంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి శ్రీ విజేందర్ రెడ్డి (ఆపరేషన్స్ మేనేజర్ డెక్కన్ టోల్వేస్ Pvt Ltd), శ్రీ నాగరాజు (కారిడార్ మేనేజర్, Deccan Tollways Pvt Ltd), శ్రీ సోమనాథ శాస్త్రి (ప్లాజా మేనేజర్, Deccan Tollways Pvt Ltd), శ్రీ సంపత్ కుమార్ (వైస్ ప్రెసిడెంట్, పిపల్ ట్రీ ఫౌండేషన్), శ్రీ సురేష్ రెడ్డి (ప్రాజెక్ట్ హెడ్, పిపల్ ట్రీ ఫౌండేషన్), శ్రీ నవీన్ గౌడ్ (సెంటర్ హెడ్) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అలాగే శిక్షణార్థులకు సాంకేతిక మరియు ప్రాయోగిక నైపుణ్యాలను అందించిన ట్రైనర్లు ప్రశాంత్ మరియు హారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. అతిథులు విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో డెక్కన్ టోల్వేస్ Pvt Ltd, Sekura Group మరియు పిపల్ ట్రీ ఫౌండేషన్ కలిసి ఈ శిక్షణా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర బిసి ముస్లిం సర్పంచ్ ల ఆత్మీయ అభినందన సభ




వెల్దండ జూన్ 16

తెలంగాణ రాష్ట్రం లో బిసి ముస్లిం సర్పంచ్ లకు హైదరాబాద్ లో రవీంద్ర భారతిలో జరిగిన ఆత్మీయ సభలో నాగర్ కర్నూల్ జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం, వెల్దండ మండలం లింగారెడ్డి పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మహ్మద్ అన్వర్ ఫాషా గారు సన్మానం అందుకున్నారు....ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిజిపి పూర్ణచంద్రరావు బీసీ టైమ్స్ వ్యవస్థాపకులు సంఘం సూర్యా రావు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, జెడ్ ఐఎఫ్ఎస్సి ఆఫీసర్ జావీద్ నాగర్ కర్నూల్ జిల్లా బిసి టైమ్స్ ఇన్చార్జ్ శాఖ, తొలివెలుగు జర్నలిస్టు రఘు గారు , తెలంగాణ రాష్ట్ర ముస్లిం సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ నుండి మెయిన్ రోడ్ వరకు 10 లక్షల నిధులతో సిసి రోడ్డు



ఆందోల్ జోగిపేట్ వుదయం

మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయం నుండి మెయిన్ రోడ్ వరకు సిసి రోడ్డు పునర్నిర్మాణం పనులు ఆందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ప్రారంభించి ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నన్నేత తో వేయవలసిందిగా ప్రతి వార్డులో కూడా సిసి రోడ్లు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు కాంట్రాక్ట్ ప్రవీణ్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఏఈ శ్రీకాంత్ వాసవి నగర్ కాలనీ అధ్యక్షుడు రాజశేఖర్ పంతులు, ఉపాధ్యక్షుడు పెండాల రాములు ప్రధాన కార్యదర్శి పూల రఘునాథ్ నాయకులు రెడ్డిపల్లి బ్రహ్మయ్య ఎదుర రమేష్ పట్టలే శ్రీనివాస్ మల్లయ్య శ్రీకాంత్ అనిల్ యశ్వంత్ మున్సిపల్ సిబ్బంది మహేందర్ లక్ష్మీనారాయణ కాంట్రాక్టర్ ముదిని రాజు తదితరులు పాల్గొన్నారు

# సంగారెడ్డి నుంచి నిర్మలే కాంగ్రెస్ అభ్యర్థి: జగ్గారెడ్డి



సంగారెడ్డి వుదయం

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయబోనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గా రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున తన భార్య నిర్మల జగ్గారెడ్డి నే ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటారని వెల్లడించారు. వందకు నూటొక్క శాతం నిర్మలే సంగారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి అని పేర్కొన్నారు. తాను సంగారెడ్డి నుంచి పోటీ చేసే అవకాశం 0.1 శాతం కూడా లేదని స్పష్టం చేశారు. తన అభ్యర్థిత్వంపై వస్తున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో తెర పడుతుందని అన్నారు.

# మందుబాబులకు గుందిమల్ల గట్టి హెచ్చరిక



- మద్యం అమ్మితే రూ.90 వేల జరిమానా
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టిస్తే రూ.10 వేల బహుమతి
- గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం.. గ్రామస్తుల పూర్తి మద్దతు

అలంపూర్, జూన్ 16 (వుదయం కరస్పాండెంట్)

గ్రామాన్ని మద్యరహితంగా తీర్చిదిద్దే దిశగా అలంపూర్ మండలం గుందిమల్ల గ్రామపంచాయతి కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. తీర్మానం ప్రకారం గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తూ పట్టుబడితే వారికి రూ.90 వేల జరిమానా విధించనున్నారు. అంతేకాకుండా మద్యం విక్రేతలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టించడంలో సహకరించిన వారికి రూ.10 వేల నగదు బహుమతి అందజేయాలని నిర్ణయించారు. గ్రామంలో మద్యం వల్ల కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, యువత భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతోందని గ్రామసభలో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామాన్ని మద్యరహితంగా మార్చేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించినట్లు గ్రామపంచాయతి ప్రతినిధులు తెలిపారు. ఈ నిర్ణయానికి గ్రామస్తులు పూర్తి మద్దతు ప్రకటించారు. గ్రామాభివృద్ధి, కుటుంబాల సంక్షేమం, యువత భవిష్యత్తు దృష్ట్యా మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు అందరూ సహకరించాలని గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు. మద్యం అమ్మకాలకు నో.. గుందిమల్లలో కఠిన నిర్ణయం గ్రామసభ తీర్మానంతో అక్రమ మద్యం విక్రయదారుల్లో ఆందోళన నెలకొనగా, గ్రామ ప్రజలు మాత్రం ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. గ్రామస్థా యిలో మద్యం నియంత్రణకు గుందిమల్ల తీసుకున్న ఈ చర్య ఆదర్శంగా నిలవనుం దని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ జిల్లా 16జూన్ (వుదయం బ్యూరో )

హన్వాడ మండలానికి చెందిన 26మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆడబిడ్డల వివాహాలకు సహాయం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం తీసుకురావడమే ఈ పథకాల యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలు పేద కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, నాయకులు యాదిరెడ్డి, హన్వాడ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నవనీత, నాయకులు టంకర కృష్ణయ్య యాదవ్, జె. వెంకటయ్య, సర్పంచులు బొట్టు శ్రీను, దీప్తి రఘురాం గౌడ్, సత్యం మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామకృష్ణ, గ్రామ అధ్యక్షులు చెన్నయ్య, రాములు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారాలపై కఠిన చర్యలు

- ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

మహబూబ్ నగర్ జిల్లా 16 జూన్ (వుదయం బ్యూరో )




సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్‌వీఎస్ హాస్పిటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం అనంతరం ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగినది, సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి, సంబంధిత వ్యక్తులపై FIR నమోదు చేయడం జరిగినట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు.ఈ సంఘటనను కొందరు వ్యక్తులు వాస్తవాలకు విరుద్ధంగా మతపరమైన ఘర్షణగా చిత్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు నిర్వహించడం పోలీసుల దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదం అనంతరం చోటుచేసుకున్న వ్యక్తిగత వివాదానికి సంబంధించినదేనని, దీనికి ఎలాంటి మత, సామాజిక లేదా వర్గపరమైన కోణం లేదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.కొంతమంది వ్యక్తులు నిర్ధారణ కాని సమాచారాన్ని, వాస్తవాలకు విరుద్ధమైన సందేశాలను సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు, అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నందున జిల్లా పోలీసు శాఖ వాటిని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలలో తప్పుడు, రెచ్చగొట్టే లేదా ప్రజలను తప్పుదోవ పట్టించే పోస్టులు, వీడియోలు, సందేశాలను ప్రచారం చేసే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి సామాజిక సామరస్యాన్ని కాపాడాలని, అనుమానాస్పద పోస్టులు లేదా వదంతులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# కేజీబీవీ అభివృద్ధిపై డీఈవో ప్రత్యేక దృష్టి

- అడ్మిషన్లు, భవన నిర్మాణాలు, మౌలిక వసతులపై క్షుణ్ణ పరిశీలన

గద్వాల జూన్ 16 (వుదయం బ్యూరో )



ధరూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ఆకస్మికంగా పర్యటించి పాఠశాల కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి నమోదైన అడ్మిషన్ల వివరాలను పరిశీలించి, నమోదు ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె, పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగు ణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆమె, విద్యార్థినులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, అవసరాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె చేతుల మీదుగా విద్యార్థినులకు నోటుబుక్కులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి ద్వారా విజయాలను సాధించాలని సూచించిన డీఈవో, ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

# విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తేవాలి




*ఎంఈఓ ఇందు ప్రియా గౌడ్ తాండూర్ వుదయం ప్రతినిధి జూన్ 16

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం తాండూరు మండల పరిధిలోని జిన్ గుర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాకలి నాగప్ప ఈ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూర్ ఎంఈఓ ఇందుప్రియ గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి ఆమె విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఇందు ప్రియా గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలి: విద్యార్థులు చిన్నతనం నుంచే ఒక మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు: క్రమశిక్షణతో కూడిన విద్యను ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలి: కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వం ఈ ఏడాది వర్షానికి తడిసినా పాడవని నాణ్యమైన లామినేటెడ్ పాఠ్యపుస్తకాల ఉపాధ్యాయులకు ఆదేశాలు: మండలం లోని ఏ ఒక్క విద్యార్థికీ పుస్తకాల కొరత రాకుండా చూడాలని, మొదటి రోజు నుంచే ప్రణాళికాబద్ధంగా తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను, హెచ్ఎంలను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు. నరసింహులు చప్పునకు మారి భాగ్యశ్రీ భాను ప్రసాద్ జయశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ తుల్జమ్మ , విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన సరికొత్త పుస్తకాలను అందుకున్న విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇసుక ర్యాంపుపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- నిబంధనల అమలుపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

రాజోలి జూన్ 16 (వుదయం కరస్పాండెంట్)

జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలి మండల కేంద్రం సమీపంలోని ఇసుక ర్యాంపును జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ర్యాంపులో జరుగుతున్న ఇసుక తవ్వకాలు, నిల్వలు, రవాణా ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇసుక తవ్వకాలు, సరఫరా ప్రక్రియ నిర్వహించా లని స్పష్టం చేశారు. ఇసుక రవాణాలో పారదర్శకత పాటించడంతో పాటు అక్రమ తవ్వకాలు, అనధికార రవాణాకు ఏమాత్రం అవకాశం ఇవ్వొద్దని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తీసుకోవాలని సూచించారు. ర్యాంపు నిర్వహణలో నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని హెచ్చరించారు.ర్యాంపులోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు.